# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 08-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ అభివృద్ధి చెందిన భారతదేశ ప్రయాణంలో మహిళలు పోషించిన పాత్ర కీలకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కొనియాడారు.
- ❖ పహల్గామ్‌లో నేరాలకు పాల్పడిన వారికి ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశం ఒక గుణపాఠం నేర్పిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
- ❖ సులభతరహా పంటల వైపు వ్యవసాయాన్ని విస్తరించడం, ఆ రంగం అభివృద్ధికి చాలా అవసరమని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.
- ❖ ఆకాశవాణి ఈరోజుతో 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంది.

=====================

ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రభావవంతమైన కార్యక్రమాల ద్వారా మహిళల నేతృత్వంలోని అభివృద్ధిని పునర్ నిర్వచించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ రోజు ప్రధానమంత్రి స్పందిస్తూ.... సైన్స్, విద్య, క్రీడలు, అంకుర సంస్థలు, సాయుధ దళాలు వంటి అన్ని రంగాలలో మహిళలు రాణిస్తున్నారని, అనేక మందికి స్ఫూర్తినిస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం వైపు ప్రయాణంలో మహిళలు పోషించిన పాత్రను ప్రశంసించారు. స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా గౌరవం, జన్ ధన్ ఖాతాల ద్వారా ఆర్థిక సౌలభ్యం మహిళలకు లభించిందని తెలిపారు. పొగ లేని వంటశాలలను తీసుకువచ్చిన ఉజ్వల యోజనను మైలురాయిగా అభివర్ణించారు. ముద్రా రుణాలు లక్షలాది మంది మహిళలు వ్యవస్థాపకులుగా మారడానికి, వారి కలలను స్వతంత్రంగా కొనసాగించడానికి దోహదపడ్డాయని అన్నారు. ఆడపిల్లలను రక్షించడానికి జాతీయ ఉద్యమంగా అభివర్ణించిన “బేటీ బచావో... బేటీ పఢావో... ప్రచారాన్ని కూడా ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు.

=====================

పహల్గామ్‌లో నేరాలకు పాల్పడిన వారికి ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశం ఒక గుణపాఠం నేర్పిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఈ రోజు తమిళనాడు మధురైలో జరిగిన సమావేశంలో అమిత్ షా

మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాల ఎన్డీఏ ప్రభుత్వంలో తమిళనాడుకు ఆరు లక్షల 80 వేల కోట్ల రూపాయలు ఇచ్చామని అన్నారు. 2026 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళ శక్తి ప్రదర్శితమైందని పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

=====================

సులభంగా పండించగల పండ్ల పంటల వైపు వ్యవసాయాన్ని విస్తరించడం, ఆ రంగం అభివృద్ధికి చాలా అవసరమని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ లో భాగంగా ఈ రోజు కేంద్రమంత్రి బెంగళూరులో పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ... డ్రాగన్ ఫ్రూట్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రస్తావించారు. ఈ పంట సాగుకు రసాయన ఎరువులు అవసరం లేదని, ఎరువు సరిపోతుందని, దాంతో అది సేంద్రీయ పంటగా మారుతుందని పేర్కొన్నారు. కాక్టస్ కుటుంబానికి చెందిన డ్రాగన్ ఫ్రూట్ వ్యాధుల బారిన పడే అవకాశం తక్కువగా ఉంటుందని, ఇది ఉత్పత్తి ఖర్చును తగ్గిస్తుందని, సాగు చేసిన మొదటి సంవత్సరం తర్వాత రైతులు ఏటా 6 నుండి 7 లక్షల రూపాయల లాభాన్ని పొందవచ్చని కేంద్రమంత్రి వివరించారు.

=====================

సేవా, సుపరిపాలన, గరీబ్ కళ్యాణ్ సూత్రాల ద్వారా భారతదేశం గత దశాబ్దంగా అద్భుతమైన పరివర్తనను సాధించింది. గత 11 సంవత్సరాలుగా మహిళలు సామాజిక పరివర్తన పొందుతూ.. జీవితంలో ప్రతి భాగంలో సాధికారత సాదిస్తూ.. చేస్తున్న ప్రయాణం నారీ శక్తికి నిదర్శనం. ప్రభుత్వ ప్రధాన పోషకాహార కార్యక్రమం, మిషన్ పోషన్ 2.0, పిల్లలు, కౌమార బాలికలు, తల్లుల పౌష్టిక ఆహారం, ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. ఆరోగ్య రంగంలో జనని శిశు సురక్ష కార్యక్రమ్ (JSSK) జనని సురక్ష యోజన (JSY) వంటి పథకాలు గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో సురక్షితమైన ప్రసవాలు, ప్రసూతి సంరక్షణను పొందేలా చేశాయి. ఉజ్వల యోజన పథకం కింద 10 కోట్లకు పైగా LPG కనెక్షన్లను అందించింది. జల్ జీవన్ మిషన్ 15 కోట్లకు పైగా గ్రామీణ గృహాలకు కుళాయి నీటిని అందించింది. 4.2 కోట్లకు పైగా సుకన్య సమృద్ధి యోజన ఖాతాలు బాలికలకు ఆర్థిక భద్రతను కల్పించాయి. మహిళల పరివర్తనలో చట్టపరమైన సంస్కరణలు కూడా ప్రధాన పాత్ర పోషించాయి. ట్రిపుల్ తలాక్ రద్దు, పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లను కేటాయించే చారిత్రాత్మక నారీ శక్తి వందన్ అధినియం.. లింగ న్యాయంలో నిర్ణయాత్మకంగా నిలిచాయి.

విరామం

=====================

ఆపరేషన్ సిందూర్ పై భారత వైఖరికీ విదేశాల్లో విశేషమైన మద్దతు లభించిందని అఖిల పక్ష బృందం సభ్యురాలు, రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. యూరప్ దేశాలలో పర్యటించిన అనంతరం ఆమె ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... భారత ప్రభుత్వ నిజాయతీని ప్రపంచానికి చాటి చెప్పడం జరిగిందన్నారు. భారత రాజనీతిలో ఒక గొప్ప చిహ్నంగా ఆపరేషన్ సిందూర్ కు మద్దతు లభించిందని ఆమె పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

మహారాష్ట్ర అహ్మదనగర్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (DRDO) వెహికల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (VRDE), 9 రక్షణ వ్యవస్థల సాంకేతికతలను 10 భారతీయ పరిశ్రమలకు ఈ రోజు

బదిలీ చేసింది. ఈ వ్యవస్థలలో కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ (CBRN) రెక్కీ వెహికల్, మౌంటెడ్ గన్ సిస్టమ్, యాంటీ-టెర్రరిస్ట్ వెహికల్, వజ్ర - అల్లర్ల నియంత్రణ వాహనం ఉన్నాయి. ఈ సాంకేతిక బదిలీ కార్యక్రమంలో DRDO చైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమీర్ వి కామత్ మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్ సమయంలో స్వదేశీ వ్యవస్థల అసాధారణ పని తీరుకు DRDOను, రక్షణ పరిశ్రమను ప్రశంసించారు.

======================

ఆకాశవాణి ఈరోజుతో 90 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. జూన్ 8, 1936న ఇండియన్ స్టేట్ బ్రాడ్‌కాస్టింగ్ సర్వీస్‌ను ఆల్ ఇండియా రేడియో (AIR)గా మార్చారు. స్వాతంత్ర్యం అనంతరం AIR వేగంగా విస్తరించింది. 1956 లో "ఆకాశవాణి" అనే పేరును స్వీకరించింది. నేడు, ఆకాశవాణి 591 స్టేషన్లను నిర్వహిస్తోంది. భారతదేశ జనాభాలో 98 శాతం మందికి చేరువైంది. 23 భాషలు, 146 మాండలికాలలో ప్రసారం చేస్తుంది. ఆకాశవాణి బాహ్య సేవల విభాగం 100కి పైగా దేశాలకు ప్రసారం చేస్తూ... ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ గొంతును వినిపిస్తోంది. AIR న్యూస్ సర్వీసెస్ డివిజన్ (NSD) దేశంలోని ప్రతి ఇంటికి 24 గంటల పాటు అన్ని ప్రధాన భాషలు, మాండలికాలలో, వివిధ ప్రాంతాలలో వార్తలు, అభిప్రాయాలను అందిస్తున్నది.

======================

భారత వ్యోమగామి శుభాంశు శుక్లా వివిధ దేశాలకు చెందిన మరో ముగ్గురు వ్యోమగాములతో కలిసి ఈ నెల 10వ తేదీన రోదసియాత్రకు వెళ్లనున్నారు. మంగళవారం ఫ్లోరిడాలోని నాసా  కెన్నెడీ స్పేస్ సెంటర్ నుండి ఆక్సియమ్ స్పేస్ నాల్గవ మానవ అంతరిక్ష ప్రయాణాన్ని ప్రారంభించనున్నారు. దాదాపు 28 గంటల ప్రయాణం తర్వాత, మరుసటి రోజు భారత కాల మానం ప్రకారం రాత్రి 10 గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరే అవకాశం ఉంది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చెందిన ఆక్సియమ్-4 వాణిజ్య మిషన్ కు  మిషన్ పైలట్‌గా పని చేస్తున్న శుక్లాతో పాటు మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్, హంగేరీకి చెందిన నిపుణులు టిబోర్ కాపు, పోలాండ్ నుండి స్లావోజ్ ఉజ్నాన్స్ కి  - విస్నివ్స్ కి అంతరిక్ష ప్రయాణం చేస్తారు. 1984లో రష్యా సోయుజ్ మిషన్‌లో రాకేష్ శర్మ చారిత్రాత్మక అంతరిక్ష ప్రయాణాన్ని నిర్వహించిన 41 సంవత్సరాల తర్వాత భారతదేశం అంతరిక్షంలోకి వెళ్ళే అవకాశం ఆక్సియమ్-4 మిషన్ ద్వారా సాధ్యమైంది. అంతరిక్ష కేంద్రంలో 14 రోజుల ఉండే సమయంలో, ఆక్స్-4 సిబ్బంది ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, పాఠశాల విద్యార్థులు, అంతరిక్ష పరిశ్రమ నాయకులు ఇతరులతో సంభాషించనున్నారు.

======================
======================